క్లుప్తంగా

అన్నసమారాధన



భక్తులకు వడ్డన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: స్థానిక పల్లపువీధిలో వేంచేసిన అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు భక్తులకు సేవలందించారు. అర్చకుడు పొన్నూరు సత్యనారాయణచార్యులు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి, ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు, న్యాయవాది చిట్టంశెట్టి పుల్లయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పారాయణలు



ఏలేశ్వరంలో పారాయణలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం మహిళలు పలు పారాయణలు చేశారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్రనామ, భగవద్గీత, లక్ష్మీఅష్టోత్తర, లలితాసహస్ర పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కార్యదర్శి కటకం కిరిటీ, తూముళొతు గురయ్య, సంఘ మహిళాసభ్యులు మల్లేశ్వరి, సూర్యాకుమారి, కల్యాణి, ఇందిరా, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ గీతా రామకృష్ణ

తుని: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ అన్నారు. తుని పట్టణంలో శనివారం ఉదయరేఖ మహిళా మండలి ఆధ్వర్యంలో న్యాయ సేవాధికార సంస్థ, పోలీసులు సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గీతా రామకృష్ణ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, అక్రమాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తోన్న ఉదయరేఖ మహిళా మండలి సభ్యులకు న్యాయపరంగా తమ వంతు సహకారం అందిస్తామని తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణశేఖర్ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎన్జీవోలు పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్

గోకవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి.హేమకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ గ్రీవెన్స్‌లో అర్జీదారులు తమ సమస్యలపై దరఖాస్తుకు ఆధార్‌కార్డు జెరాక్స్, ఫోన్ నంబర్, సంబంధిత రికార్డులు జతచేసితో అందజేయాలన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రక్షిత తాగునీరు అందించాలి

కిర్లంపూడి: గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రాజుపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లను శనివారం ఆయన పరిశీలించారు. దగ్గరుండి సిబ్బందితో క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని ఉదయం నుంచి విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున వేంచేసిన శ్రీవల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మండలం నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి కాలినకడన వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అప్రమత్తతే ఆయుధం

- గ్రామాల్లో కోరలు చాస్తున్న అతిసార
- కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో భారీగా కేసుల నమోదు
- వాతావరణ మార్పులతోనే వ్యాప్తి
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న దృశ్యం



బెండపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

తొండంగి: వాతావరణంలో సంభవించిన మార్పులతో గ్రామాల్లో అతిసార వ్యాధి (డయేరియా) కోరలు చాస్తోంది. వేగంగా వ్యాప్తి చెందుతూ ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తోంది. ఇటీవల మండలంలోని కొమ్మనాపల్లి ప్రబలిన డయేరియా ప్రస్తుతం బెండపూడిలో తాండవిస్తోంది. గత వారం రోజుల్లో కొమ్మనాపల్లిలో 100 పైగా కేసులు నమోదు కాగా ఇద్దరు మృత్యువాత పడ్డారు. మిగిలిన వారంతా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతూ క్రమంగా కోలుకుంటున్నారు. డయేరియా బాధితులకు వైద్యం అందించేందుకు ప్రభుత్వ అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు కాకినాడ జీజీహెచ్, తుని ఏరియా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది.

మూడు రోజుల్లో 50కి పైగా కేసులు

కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో గత మూడు రోజుల్లో దాదాపు 50కి పైగా డయేరియా కేసులు నమోదయ్యాయి. బాధితులు బెండపూడి, తుని ఏరియా ఆస్పత్రి, ఇతర ప్రాంతాల్లో వైద్యం పొందుతున్నారు. డయేరియా బారిన పడిన పిల్లలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. వర్షాకాలంలో వచ్చిన మార్పులతో పాటు కలుషిత తాగునీరు, నిల్వ ఆహారం తదితర కారణాలతో అతిసారం వ్యాప్తి చెందుతుందని, అప్రమత్తంగా ఉండటం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు.

డయేరియా లక్షణాలు

అతిసార వ్యాధి బారిన పడిన వారిలో కడుపు నొప్పి, పొత్తికడుపు ఉబ్బటం, దప్పిక ఎక్కువగా ఉంటడం, బరువు తగ్గడం, జ్వరం, వికారం, వాంతులు, నీళ్ల విరోచనాలు వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. మలంలో లేదా విరేచనాలతో పాటు రక్తం పడే అవకాశం ఉంది. ఈ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలి.



ఇంటింటా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రధాన కారణాలు ఇలా..

కలుషితమైన తాగునీరు, నిల్వ ఆహారం అపరిశుభ్రత, పారిశుధ్యం క్షీణించడం తదితర కారణాల వల్ల అతిసార వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గి ప్రజలు అనారోగ్యానికి గురవుతారు.

జాగ్రత్తలు పాటించాలి



డయేరియా వ్యాప్తికి కలుషిత తాగునీరు, నిల్వ ఉంచిన మాంసం, చేపలు, ఇతర ఆహార పదార్థాలు ప్రధాన కారణం. వేడి నీళ్లు, వేడి ఆహార పదార్థాలు, పరిశుభ్రత వంటి జాగ్రత్తలు పాటించడం ద్వారా డయేరియాను అడ్డుకోవచ్చు. వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పిస్తున్నారు. కొమ్మనాపల్లిలో డయేరియా బాధితులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాం. క్రమంగా బాధితులు కోలుకుంటున్నారు.

–పి.రవికుమార్, వైద్యాధికారి, ఏవీనగరం పీహెచ్‌సీ

నివారణ ఇలా..

కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగడం, వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం, తరచూ సబ్బుతో చేతులు కడుక్కోవడం, ఇంటి పరిసరాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవడం, శీతల పానీయాలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డయేరియా వ్యాధిని నివారించవచ్చు. వ్యాధికి గురైన వ్యక్తికి వెంటనే ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్)ను వైద్యుల సూచనల మేరకు ఇవ్వాలి. వ్యాధినిరోధక శక్తిని పెంచేలా వైద్యం అందించాలి. అప్పటికే దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే మరింత అప్రమత్తంగా ఉండి నిపుణులైన వైద్యుల ద్వారా వైద్యం అందించాలి.

పిల్లలకు డయేరియా నివారణ టీకా

చిన్నపిల్లలు డయేరియా వ్యాధి బారిన పడకుండా ప్రభుత్వం వైద్యారోగ్యశాఖ ద్వారా రోటా వైరస్ టీకాను అందిస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ టీకాను తప్పనిసరిగా వేయించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఘనంగా దేవలమహర్షి జయంతి



దేవల మహర్షికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

తుని: స్థానిక గౌరీశంకర సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద శనివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవలమహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవల మహర్షి చరిత్రను అవగాహన చేసుకుని ఉన్నతమైన జీవన మార్గాన్ని ఆచరించాలని కమిటీ సభ్యులు గొల్ల ప్రసాద్, కుందెం సత్యనారాయణ కోరారు. దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ దొంతంశెట్టి మల్లికార్జునరావు పర్యవేక్షణలో దేవలమహర్షికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తూతిక నాగేశ్వరరావు, మాదన వీరభద్రరావు, బళ్ల శ్రీను, నాగ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



చినశంకర్లపూడిలో నీట మునిగిన రోడ్డు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: గత మూడు రోజులుగా గ్రీష్మతాపంతో అల్లాడిన ప్రజలకు శనివారం కాస్త ఉపశమనం కలిగింది. మండల వ్యాప్తంగా తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడులో 3.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం. చినశంకర్లపూడి, ఏలూరు తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. మెట్ట పంటలకు, ఖరీఫ్ సాగుకు వర్షం మేలు చేస్తుందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

పార్టీ కార్యాలయం కూల్చివేత దుర్మార్గపు చర్య

వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రఘురాం



జగ్గంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం దుర్మార్గపు చర్య అని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నిర్మాణ విషయమై పార్టీ కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. తమ పరిధి దాటి ఎటువంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు చెప్పినా ప్రభుత్వం కోర్టు ఆదేశాలను దిక్కరించి శనివారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని కూల్చివేసిందని విమర్శించారు. ఇది కచ్చితంగా కోర్టు ధిక్కారణ కిందకు వస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి చర్యలకు అధైర్యపడవద్దన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్షం కొత్త కాదని, ఆయన పోరాట యోధుడని కొనియాడారు. కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు వీటి రాష్ట్రాభివృద్ధి, ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు.

ప్రగతిశీల మహిళా సంఘం వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నేత వీరాంజనేయులు

జగ్గంపేట: గ్రామ శివారు రంగవల్లి నగర్‌లో శనివారం ప్రగతిశీల మహిళా సంఘం 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా నేత కొండేపూడి మంగక్క అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి ప్రగతిశీల మహిళా సంఘం మహిళల హక్కుల కోసం విరోచితంగా పోరాటాలు చేస్తోందన్నారు. విప్లవోద్యమంలో అసువులుబాసిన వీర మహిళలకు నివాళులర్పించారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకువచ్చినా వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, జిల్లా నాయకులు డి.నారాయణమూర్తి, మడికి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కిర్లంపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

కిర్లంపూడి: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.ఆశయ్య అధ్యక్షతన శనివారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సీతారామారావు మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో డయోరియ కేసులు నమోదవుతున్నాయన్నారు. అధికారులు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సాయిహేమాంజలి, పంచాయతీ విస్తరణాధికారి ఎన్.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

జగ్గంపేట: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన బి.జ్యోతికాదేవి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లాలో రెండో స్థానం సాధించింది. దీంతో పాఠశాల పూర్వ విద్యార్థులు ఆమెకు రూ.53 వేలు ఆర్థిక సాయం అందించారు . శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీఎస్ రంగారావు చేతుల మీదగా ఆర్థిక ప్రోత్సాహకాన్ని విద్యార్థిని దేవికి అందజేశారు. ఇంటర్, డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నేత రుచిడాబా చౌదరి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తత అవసరం



ఇట్ల కిషోర్, ఆర్డీవో, కాకినాడ

కాకినాడ సిటీ: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇట్ల కిషోర్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యంగా పంచాయతీ రెవెన్యూ గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పని చేయాలని, ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులు తక్షణం శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, ముఖ్యంగా నిల్వ పదార్థాలు, నిల్వ ఉంచిన మాంసం వంటి పదార్థాలు తీసుకోవద్దని, కాచి చల్లార్చిన వేడి నీటిని మాత్రమే తీసుకోవాలన్నారు. డివిజనల్ స్థాయిలో సీజనల్ వ్యాధులకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కంట్రోల్ రూమ్ నంబర్ 8008803208 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని ఆర్డీవో కిషోర్ వివరించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- గ్రామాల్లో జోరుగా అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలు
- గర్భిణులకు సామూహిక సీమంతాలు



కేఓ మల్లవరంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు



నెల్లిపూడిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రమణ, సీడీపీఓ పద్మావతి

తుని రూరల్: మండలంలోని దొండవాక, కేఓ మల్లవరం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలపై పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలికల చదువు భవితకు వెలుగును ఇస్తుందన్నారు. బాల్య వివాహాలు నేరమన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాత ఆడపిల్లలకు, 21 ఏళ్లు నిండితన తర్వాత మగ పిల్లలకు పెళ్లి చేయాలన్నారు. బాలికలు, మహిళా అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ఆరేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, పోషకాహారం ఆవశ్యకతలను సీడీపీఓ వివరించారు. సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలి

శంఖవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. మండలంలోని నెల్లిపూడిలో శనివారం మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు 5 సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలన్నారు. చిన్నతనం నుంచి చిన్నారులకు మంచి విద్యను అందిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ టీవీ రజిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ ఘనపాఠి, దత్తాత్రేయ శర్మ, కోట వంశీ, ఫణిశర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. మొత్తం 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



రౌతులపూడిలో వాహనాలను తనిఖీ చేస్తున్న కత్తిపూడి ఎంవీఐ శ్రీనివాస్

రౌతులపూడి: మండల పరిధిలోని ప్రధాన రహదారుల్లో శనివారం కత్తిపూడి ఎంవీఐ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ట్యాక్స్ చెల్లించని ఆరు వాహనాలను సీజ్ చేశారు. రికార్డులు సక్రమంగా లేని మరో 24 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.3.25 లక్షల అపరాధ రుసుము విధించినట్టు ఎంవీఐ శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వాహనాలు నడిపినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో భారత్ నృత్యోత్సవ్



కేరళలో నృత్యప్రదర్శనలు ఇస్తున్న జగ్గంపేట విద్యార్థులు

జగ్గంపేట: కేరళలో ఇటీవల భారత్ నృత్యోత్సవ్ పేరిట 100 రోజుల పాటు జరిగిన నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదైందని జగ్గంపేట నృత్య కళాకారిణి ముళ్లపూడి విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జగ్గంపేటలోని శ్రీసీతారత్నం నృత్య కళావేదికకు చెందిన 96 మంది విద్యార్థులు కేరళలో జరిగిన నృత్యోత్సవంలో పాల్గొన్నారన్నారు. పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారని చెప్పారు. జగ్గంపేట, ధర్మవరం గ్రామాలకు చెందిన విద్యార్థులు 10 రోజుల పాటు కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పలు ప్రముఖ దేవాలయాలతో పాటు చివరగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారని వివరించారు.

280 లీటర్ల సారా స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న సారాతో ప్రత్తిపాడు సెబ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్–ఎస్ఈబీ) పరిధిలోని అక్రమంగా తరలిస్తున్న 280 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాల్లోకి వెళితే... శంఖవరం మండలం మాసంపల్లిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మాసంపల్లి నుంచి జీపులో తరలిస్తున్న 280 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రౌతులపూడి మండలం పల్లపు చామవరం గ్రామానికి చెందిన ట్రక్ డ్రైవర్ గోరకపూడి సురేష్‌ను అరెస్టు చేశారు. అలాగే మాసంపల్లి గ్రామానికి చెందిన సారా యజమాని వెలుగుల శ్రీనుపై కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు సెబ్ సీఐ ఎల్. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో సెబ్ ఎస్సై ఎం.ఆశాలత, సెబ్ హెచ్‌సీ ఎల్.కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని ప్రత్తిపాడు సెబ్ సీఐ ఎల్.చిరంజీవి సూచించారు. స్థానిక ప్రగతి, నైపుణ్య డిగ్రీ కళాశాలల్లో శనివారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా సెబ్ సీఐ చిరంజీవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు శరీరాన్ని నిర్వీర్యం చేస్తాయన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై ఎం.ఆశాలత, ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.